# కొంతమంది పాపలు...తీపిగుండె కోతలు

వార్త గురువారం 30, ఏప్రిల్ 1998

తిప్పరాజు రాధాకృష్ణ
ప్రభాతవార్త, సిటీబ్యూరో

"స్వీట్స్ తినాలని ఉన్నా అమ్మా, నాన్న వద్దనడంతో మానేశాను. చాక్‌లెట్స్, స్వీట్స్ తినకుండా ఉండాలంటే మొదట్లో కొంచెం ఇబ్బంది అనిపించింది. ఆ తర్వాత అలవాటయిపోయింది. అయితే అప్పుడప్పుడూ మోతాదు మించకుండా ఒకటీ అరా స్వీట్స్, చాక్‌లెట్స్ తింటుంటానని" పదిహేనేళ్ళ శశికిరణ్ చెప్పాడు. తొమ్మిదేళ్ళ వయసు నుంచి తాను ఇన్సులిన్ ఇంజక్షన్స్ తీసుకుంటున్నాననీ మొదట్లో వాళ్ళ నాన్న ఇంజక్షన్ చేసేవారనీ అయితే ఇప్పుడు నోవోపెన్-3 తో స్వయంగా తానే ఇంజక్షన్స్ చేసుకుంటున్నానని శశికిరణ్ తెలిపాడు. ఒకసారి స్కూల్లో ఉండగా లోసుగర్ వచ్చిందనీ వెంటనే చాక్‌లెట్ తినడంతో కొద్దిసేపటికి సాధారణ స్థితికి చేరుకోగలిగాననీ శశికిరణ్ తెలిపాడు. పూర్తిగా కాకపోయినా ఆటలకు కొద్దిగా దూరంగా ఉంటుంటాను" అని అతను పేర్కొన్నాడు.

పదేళ్ళ నుంచి తాను ఇన్సులిన్ ఇంజక్షన్స్ తీసుకుంటున్నానని పధ్నాలుగేళ్ళ రాజేశ్వరి చెప్పింది. మొదట్లో చాక్‌లెట్స్ తినవద్దనీ అదేపనిగా ఆడొద్దనీ అనడరి కష్టం అనిపించినా ప్రస్తుతం అలవాటయిపోయిందని ఆమె తెలిపింది. చాక్‌లెట్స్, స్వీట్స్ తినాలనిపించినప్పుడు అమ్మా, నాన్నతో చెప్పి వాళ్ళ అనుమతితో ఒకటీ, అరా చాక్‌లెట్స్ తింటుంటానని ఆమె చెప్పింది. ఒకసారి ఆడుకుంటుండగా లోసుగర్ వచ్చి వళ్ళంతా చమటలు పట్టి గాభరాగా అనిపించిందని అలాంటి సందర్భాల్లో గ్లూకోజ్ బిస్కెట్లు తింటే సాధారణ స్థాయికి చేరుకునేదని రాజేశ్వరి చెప్పింది.

తరచూ తన కుమార్తెకు అనారోగ్యంగా ఉండడాన్ని వాతావరణం మార్పో, మరింకేదో అనుకున్నాము తప్ప డయాబెటీస్ అని ఊహించనేలేదని బిహెచ్ఇఎల్ ఉద్యోగి భిక్షపతి తెలిపారు. అప్పటివరకూ తమ కుటుంబంలో ఎవరికీ డయాబెటీస్ లేనేలేదనీ ఈ వ్యాధి గురించి ఆ క్షణం వరకూ తమకే మాత్రం అవగాహన లేదని ఆయన పేర్కొన్నారు. ఒకరోజు డ్యూటీ నుంచి ఇంటికి వచ్చేప్పటికి అప్పటికే తన కుమార్తెను సమీపంలోని నర్సింగ్‌హోమ్‌లో చేర్పించారనీ అక్కడ అవసరమైన పరీక్షలు చేసి డయాబెటీస్‌గా నిర్ధారించి పిల్లను నీలోఫర్‌లో చేర్పించమన్నారని భిక్షపతి వివరించారు. అక్కడ నెలా పదిహేను రోజులున్నా డయాబెటీస్ ఏమాత్రం కంట్రోల్ కాకపోగా రెండు మూడు సార్లు కోమాలోకి వెళ్ళిపోవడంతో చాలా కంగారుపడ్డామని ఆయన తెలిపారు. తట్టుకోలేనంత డబ్బు ఖర్చవుతున్నా తాను ఏమాత్రం వెనుకాడలేదనీ అయితే పిల్ల ఎదుగుదల నిలిచిపోవడం తనను మానసికంగా కుంగదీసిందని ఆయన ఆవేదనగా చెప్పారు. చాక్‌లెట్స్, స్వీట్స్ పట్ల అయిష్టత ఏర్పర్చుకున్న తన కుమార్తె వాటికోసం ఏమాత్రం మారాం చేయదనీ తామే అప్పుడప్పుడూ కొద్దిపాటి స్వీట్స్ ఇస్తుంటామని ఆయన పేర్కొన్నారు.



రాజేశ్వరి



మాస్టర్ శశికిరణ్

ప్రతీ వందమందిలో ఆరుగురు డయాబెటీస్ పేషెంట్లు ఉన్నారని సర్వేలు వెల్లడిస్తున్నాయి.

ప్రతీ వందమంది డయాబెటీస్ పేషెంట్లలో ఒక జువైనెల్ డయాబెటిక్ పేషెంటు (బాలబాలికలు) ఉన్నారని డాక్టర్లు చెబుతున్నారు.

ఈ ప్రాతిపదికన జంటనగరాల్లో సుమారు రెండు నుంచి రెండువేల ఐదు వందల మంది డయాబెటీస్ పిల్లలున్నారని తెలుస్తోంది.

ఈ పిల్లల్లో తొమ్మిది నెలలున్న ఒక బాబు, మూడేళ్ళ వయస్సుగల ఒక పాప కూడా ఉన్నారు.

పధ్నాలుగేళ్ళ రాజేశ్వరి అనే బాలిక తన నాలుగో ఏట నుంచి ఇన్సులిన్ ఇంజక్షన్స్ వాడుతోంది.

పదిహేనేళ్ళ శశికిరణ్ తన తొమ్మిదో ఏట నుంచి ఇన్సులిన్ ఇంజక్షన్లు వాడుతున్నాడు.

వరంగల్‌కు చెందిన మూడేళ్ళ పాపకు ఇప్పటి నుంచి ఇన్సులిన్స్ ఇస్తున్నారు.



ఎండోక్రైనాలజిస్ట్
డాక్టర్ కె.డి.మోడి

వీళ్ళంతా జీవితాంతం ఇన్సులిన్ ఇంజక్షన్స్ వాడుతూనే ఉండాలి.

ఇరవై అయిదేళ్ళు లోపు గలవారందర్నీ జువైనెల్ పేషెంట్లుగా పరిగణిస్తారు.

జువైనెల్ డయాబెటిక్ పేషెంట్లలో పది నుంచి ఇరవై ఏళ్ళలోపు వారే ఎక్కువగా ఉన్నారు.

నాంపల్లి మెడ్విన్ హాస్పిటల్, మలక్‌పేట యశోదా హాస్పిటల్‌కు కనీసం వారానికి రెండు లేదా మూడు కొత్తకేసులు వస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ పిల్లలు అందరిలా చాక్‌లెట్స్, స్వీట్స్ తినకూడదు.

అందరిలా చెంగు చెంగున ఉరకలేస్తూ ఆడకూడదు.

ఇంజక్షన్స్ మానేస్తే కోమాలోకి వెళ్ళిపోయే అవకాశం ఉంది.

ఆడుకునే సమయాల్లో లోసుగర్, హైసుగర్ వచ్చి స్పృహ తప్పే అవకాశం కూడా ఉంది.

క్రమం తప్పకుండా రోజుకి రెండు తడవులు ఇన్సులిన్ ఇంజక్షన్స్ ఇస్తుండాలి.

ఒకో ఇన్సులిన్ బాటిల్ ఖరీదు 150 నుంచి 500 రూపాయల వరకూ ఉంది.

రెండు పూటలా ఇంజక్షన్స్ ఇవ్వడానికి ఇలాంటి బాటిల్స్ నెలకు 5 లేదా 6 అవసరం అవుతాయి.

ఈ ఇన్సులిన్ బాటిల్‌తో పాటు సిరంజిలు కూడా కొంటుండాలి.

ఒక్కొక్కటి ఐదు రూపాయల ఖరీదు చేసే ఈ సిరంజి ఆరు నుంచి ఎనిమిది సార్లు ఉపయోగించవచ్చు.

ఇంజక్షన్స్‌తో పాటు తరచూ పది రోజులకోసారి గ్లూకోమీటర్‌తో సుగర్ టెస్ట్ చేస్తుండాలి.

ప్రతీ సారీ కన్సల్టేషన్‌కు రావడం కష్టంగనుక ఆ యా పిల్లల తల్లితండ్రులకు ఇంజక్షన్స్ ఇవ్వడం నేర్పుతున్నారు డాక్టర్లు.

జువైనెల్ పేషెంట్లే స్వయంగా ఇంజక్షన్స్ చేసుకోగల పరికరాన్ని కూడా ఈ మధ్య ప్రవేశపెట్టారు.

సాధారణ పెన్నులా కనిపించే నోవోపెన్-3 అనే ఈ పరికరంతో ఎవరిమీదా ఆధారపడకుండా పేషెంట్లే స్వయంగా ఇంజక్షన్స్ చేసుకోవచ్చు.

ఇన్సులిన్ ఇంజక్షన్స్ కొనలేక, అనుక్షణం వారిని కంటికి రెప్పలా కాపాడలేక కొందరు తమ పిల్లల్ని విసుక్కుంటూ ఉంటుంటారు.

గతంలో ఈ వ్యాధి వచ్చిన వారు ఒక సంవత్సరంలోపు మరణించేవారనీ .

1921లో డాక్టర్ ఫ్రెడరిక్ బేంటింగ్ ఇన్సులిన్ కనుగొన్న తరువాత మధుమేహం వల్ల కలుగుతున్న ప్రాణ నష్టానికి బ్రేక్ పడిందని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కె.డి.మోడి తెలిపారు.

శరీరంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే బిటాసెల్స్‌కోల్పోవడం వల్ల డయాబెటీస్ వస్తుందని ఆయన పేర్కొన్నారు.

అకస్మాత్తుగా బరువు తగ్గిపోవడం, నీరు ఎక్కువగా తాగుతుండడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన చెయ్యాల్సి రావడం, ఎక్కువ ఆకలిగా ఉండడం, కడుపులో పోట్లు వచ్చి వాంతులు ఈ వ్యాధి లక్షణాలని డాక్టర్ మోడి చెప్పారు.

ఈ లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టరును సంప్రదించడం అవసరం అనీ నిర్లక్ష్యం చేస్తే కోమాలోకి వెళ్ళే అవకాశం ఉందని ఆయన వివరించారు.

వ్యాధి లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చేయడం వల్ల పరిస్థితి విషమించి హాస్పిటల్‌లో చేర్చి 24 నుంచి 48 గంటలపాటు పరిశీలనలో ఉంచాల్సి వస్తుందని డాక్టర్ మోడి తెలిపారు.

ఇద్దరు జువైనెల్ పేషెంట్లకు వివాహం చేస్తే వారికి పుట్టే పిల్లలకు కూడా డయాబెటీస్ వచ్చే అవకాశం 30 శాతం వరకూ ఉన్నాయని ఆయన వెల్లడించారు.

జువైనెల్ పేషెంట్లకు భవిష్యత్తులో కిడ్నీ ఫెయిలయ్యే అవకాశాలు 20 శాతం వరకూ ఉన్నాయనీ అంధత్వం వచ్చే అవకాశాలు 10 శాతం ఉన్నాయని ఆయన వివరించారు.

సాధారణ ప్రజలతో పోలిస్తే డయాబెటీస్ పేషెంట్లకు గుండెపోటు వచ్చే అవకాశాలు నాలుగురెట్లు ఎక్కువనీ కొన్ని సందర్భాల్లో పుళ్ళు ఏర్పడి కాలు తీసేయ్యాల్సి వస్తుందని డాక్టర్ మోడి పేర్కొన్నారు.

ఈ జువైనెల్ డయాబెటీస్ పిల్లలు ఆడుకోవడానికి వెళ్ళినపుడు సుగర్ డౌన్ అయ్యి స్పృహ తప్పే అవకాశం ఉందనీ నిద్రలో కూడా సుగర్ డౌన్ అయ్యే అవకాశం ఉన్న కారణంగా వారిని గమనిస్తుండాలని ఆయన తెలిపారు.

ఈ పిల్లలు ఖాళీ కడుపుతో ఎక్సర్‌సైజుల్లాంటివి చెయ్యకూడదనీ ప్రతీ నాలుగు గంటలకోసారి పాలు, బ్రెడ్, ఇడ్లీల్లాంటి తేలికపాటి పదార్థాలు ఇస్తుండాలని ఆయన వివరించారు.


ఈ జువైనెల్ పిల్లలకు జ్వరంలాంటిదేదయినా వచ్చినపుడు ఇన్సులిన్ ఇవ్వడం ఆపకూడదనీ తరచూ పరీక్షలు చేస్తూ ఉండాలని ఆయన వెల్లడించారు.

ఆ సమయంలో ఫ్రూట్‌జ్యూస్, స్వీట్లు తక్కువ మోతాదులో తినవచ్చునీ వారికి ఎక్కువగా నీరు తాగిస్తూ ఉండాలని ఆయన పేర్కొన్నారు.

ఈ జువైనెల్ పేషెంట్లలో వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు నోవోకేర్ అనే కంపెనీ దేశవ్యాప్తంగా ప్రతీ ఏడాది పెయింటింగ్ కాంపిటీషన్లు నిర్వహిస్తూ వస్తోంది. గత ఏడాది దేశవ్యాప్తంగా నిర్వహించిన పెయింటింగ్ కాంపిటేషన్‌లో నగరంలోని చైతన్యపురికి చెందిన శశికిరణ్ ద్వితీయ బహుమతి పొందాడు.

ఈ పోటీలు నిర్వహించడం ద్వారా ఇన్సులిన్, డైట్, ఎక్సర్‌సైజ్ క్రమం తప్పకుండా చెయ్యాలని వారికి అర్థం అయ్యేలా చేస్తున్నారు.

నగరంలోని అపోలో హాస్పిటల్ కూడా రెండేళ్ళ నుంచి ప్రతీ ఏడాది నవంబరు 14వ తేదీన జువైనెల్ పేషెంట్లకు కాంపిటీషన్లు, కౌన్సిలింగ్ నిర్వహిస్తోంది.










**నోవోకేర్ కంపెనీ 1997 నవంబరు 14న నిర్వహించిన పెయింటింగ్ కాంపిటీషన్‌లో జువైనెల్ బాలలు గీసిన చిత్రాలు**